11న వైద్య ఉద్యోగుల ఆత్మగౌరవ సభ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎపి ప్రజారోగ్య వైద్యఉద్యోగుల సంఘం పిలుపు మేరకు వైద్య ఉద్యోగుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి జివిఐ. ప్రసాద్ కోరారు. ఈ నెల 11న విజయవాడలో ఈ సభ జరగనుందన్నారు. ఆదివారం ఆయన పాలమూరులోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సభలో మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి, ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్. సూర్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్యఆరోగ్యశాఖకు గుర్తింపు, గౌరవం లభిస్తుందంటే దాని వెనుక ఆ శాఖ ఉద్యోగుల నిరంతర కృషి ఉందన్నారు. కోవిడ్ కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పని చేశారని గుర్తు చేశారు. అటువంటి ఉద్యోగుల సేవలను గుర్తించకపోగా వారిని రకరకాలుగా వేధింపులకు గురి చేస్తుండటం చాలా బాధా కరమన్నారు. ఈ సమస్యలపై ఈ సభలో చర్చించి కీలక నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

రబీ పనులు ముమ్మరం..!

- 'పశ్చిమ'లో 250 ఎకరాల్లో నారుమళ్లు పూర్తి
- ఏలూరు జిల్లాలోనూ ముమ్మరంగా పనులు
- 20వ తేదీకి నారుమళ్లు పూర్తయ్యే అవకాశం
- 1121 విత్తనంపై మక్కువ చూపుతున్న రైతులు
- కొల్లేరు భూముల్లో వరిసాగుకు ఇ-క్రాప్‌పై రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాలవ్యాప్తంగా రబీ పనులు ఊపందుకున్నాయి. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ఇబ్బందులతో సతమతమవుతున్నప్పటికీ సాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని రబీసాగుకు రైతులు నడుంబిగించారు. దీంతో రెండు జిల్లాల్లోనూ ముమ్మరంగా నారుమడుల ప్రక్రియ సాగుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 2.50 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 70,104 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపడుతున్నారు. ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లాలో 250 ఎకరాల్లో నారుమడులు పూర్తవ్వగా, ఏలూరు జిల్లాలోనూ ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 20వ తేదీకల్లా రెండు జిల్లాల్లోనూ రబీ నారుమడులు పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఈ ఏడాది సంక్రాంతి పండుగకు ముందే వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని చెప్పొచ్చు. ఈ ఏడాది రబీసాగుకు సాగునీటి సమస్య లేదని రెండు జిల్లాల్లోనూ సాగునీటి సలహా మండలి సమావేశాల్లో స్పష్టం చేశారు. గోదావరిలో దాదాపు 102 టిఎంసిల నీరు అందుబాటులో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు లెక్కలు తేల్చారు. ఏప్రిల్ పదో తేదీ వరకూ కాలువలకు నీరు విడుదల సాగనుంది. త్వరగా రబీ నాట్లు పూర్తయితే రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం తగ్గనుంది. రబీలో రైతులు అత్యధికంగా అధికారులు సూచించిన 1121 విత్తనాలను సాగు చేస్తున్నారు. రెండు జిల్లాల్లోనూ పలు చోట్ల బొండాల విత్తనంతో పాటు 1153, 1156 విత్తనాలను సైతం సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విత్తనాలు దిగుబడి ఎక్కువ రావడంతోపాటు, ఇబ్బందులు తక్కువగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు. అయితే బొండాలు, 1153, 1156 రకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనడం అసాధ్యమని అధికారులు చెబుతున్నారు. దీంతో రబీ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ఈ విత్తన రకాల పంటను సైతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు రబీలో కొనుగోళ్లపైనా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇదేవిధమైన పరిస్థితులు నెలకొంటే ఏమిటనే ఆందోళన వారిని వెంటాడుతోంది. నీటిఎద్దడి సమస్య లేదని చెప్పడంతో రైతులు కొంతమేర ఊపిరి పీల్చుకుంటున్నారు. మరో వారం, పది రోజుల్లో రబీ పనులు మరింత ముమ్మరంగా సాగనున్నాయి.

కొల్లేరు భూముల్లో సాగుపై ఆందోళన

కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లో వందల ఏళ్ల నుంచి రైతులు వరిసాగు చేస్తున్నారు. ఈ భూములను 'అనసరి' భూములుగా పిలుస్తారు. ఈ భూములన్నీ పేద, మధ్యతరగతి రైతులవే. ఈ భూములకు పట్టాలు, పాస్‌బుక్‌లు ఏమీ ఉండవు. కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లో నిబంధనలకు అనుగుణంగా సంప్రదాయ వ్యవసాయం చేసుకోవచ్చునని ప్రభుత్వాలు చెబుతున్నాయి. అందుకు అనుగుణంగానే రైతులు కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లో దశాబ్దాలుగా వరిసాగు చేస్తున్నారు. నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఆకివీడు వంటి పలు మండలాల్లో అనసరి భూములు ఎక్కువగా ఉన్నాయి. వేలాది ఎకరాల భూముల్లో రైతులు రబీ సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో తెచ్చిన నూతన విధానం చూసి కొల్లేరు భూముల్లో వరిసాగు చేసే రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇ-క్రాప్‌లో నమోదైతేనే ధాన్యం కొనుగోలు చేసేవిధంగా నిబంధనలు పెట్టారు. అనసరి భూములను ఇ-క్రాప్‌లో నమోదు చేస్తారా, లేక అభయారణ్యం నిబంధనలు తెరపైకి తెచ్చి తప్పించుకుంటారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఇ-క్రాప్ చేయకపోతే పంట పండిన తర్వాత రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి రానుంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

పాలకొల్లులో ఉపాధ్యాయుల ర్యాలీ

ఒపిఎస్ అమలు కోరుతూ ర్యాలీ

యుటిఎఫ్ ఆధ్వర్యాన నినదించిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - నరసాపురం

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ఆదివారం 10కె వాక్ నిర్వహించారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని, ఒపిఎస్ మాత్రమేనని నినదించారు. 10కె వాక్ ముగింపు సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉండగా పాదయాత్ర సమయంలో తాము అధికారంలోకి రాగానే వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లయినా ఇచ్చిన హామీ అమలు చేయకపోగా ఇదేమిటని నిరసన తెలిపే ప్రయత్నం చేస్తే అమానుషంగా నిర్బంధం విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ఎస్.విజయరామరాజు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం జరిగే పోరాటాలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచి వేయాలని చూడటం అవివేకమన్నారు. మరింత రెట్టింపు ఉత్సాహంతో పోరాటాలు సాగిస్తామని, సిపిఎస్‌కు వ్యతిరేకంగా సాగే పోరాటాల్లో ఉపాధ్యాయులు మరింత సమరశీలంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆర్.మార్కండేయులు, జిఎన్ఎస్ఆర్.స్వామి, కెఎస్‌కె.ప్రసాద్, పి.శ్యామసన్, ఎన్‌వి.సత్యనారాయణ, ఎస్.అజయ్‌కుమార్, కృష్ణకుమారి, కె.బ్రహ్మయ్య, జగ్గరాజు, ఎస్.చంద్రకుమార్ పాల్గొని నాయకత్వం వహించారు.

నరసాపురంలో మాట్లాడుతున్న గోపీమూర్తి

పాలకొల్లు: రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగి గాంధీ బొమ్మ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు పట్టణంతోపాటు రూరల్ మండలం, పోడూరు, యలమంచిలి మండలాల ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.రామశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎవి.రామభద్రం మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీనే తాము అమలు చేయాలని కోరుతున్నామన్నారు. సిపిఎస్ స్థానంలో జిపిఎస్ వద్దని, తాము కేవలం ఒపిఎస్ మాత్రమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కె.లక్ష్మీనారాయణ, పి.క్రాంతికుమార్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాస్, పూర్వపు రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు జయప్రభ, ఎం.వెంకటేశ్వరరావు, కె.శిరీష, సిపిఎస్ జిల్లా సబ్ కమిటీ సభ్యులు కె.దుర్గాప్రసాద్, మండల శాఖల నేతలు పిల్లి శ్రీనివాసరావు, వి.జగ్గారావు, వై.ప్రభాకరశాస్త్రి, కె.త్రినాథ్, జెవి.రమణ, ఎం.రాజశేఖర్, ఇడివి.ప్రసాద్, పి.క్రాంతికుమార్, బి.రాజు, ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సగం చెరువులో సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సగం చెరువులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రం చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో అన్ని సేవలు సచివాలయాల్లోనే లభిస్తున్నాయన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సౌలభ్యం చేయడంతోపాటు కొన్ని వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో సర్పంచి కడలి నాగమణి, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజులనాయుడు, వైసిపి గ్రామాధ్యక్షులు కెడివి.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ శీలం సత్యనారాయణ, నేతలు గుడాల చిన నాగేశ్వరరావు, కుక్కల శ్రీనివాసరావు, మండలంలోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

హాస్టళ్లలో సబ్ కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణంలోని మూడో వార్డు భూపతివారివీధిలో ఉన్న ఎస్‌సి, బిసి బాలుర సంక్షేమ వసతి గృహాన్ని సబ్ కలెక్టర్ సూర్యతేజ ఆదివారం పరిశీలించారు. వివిధ తరగతుల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. మౌలిక సదుపాయాలు, భోజనాల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. భాషా పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నాగదేవి, విఆర్‌ఒ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

ప్రజాశక్తి - భీమవరం

వాహనాల డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రాఘవయ్య టీచర్స్ హోమ్‌లో ఎస్‌కె.భాషా అధ్యక్షతన భీమవరం ఏరియా డ్రైవర్ల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ దేశంలో కీలకమైన, అత్యంత ప్రాధాన్యత గల డ్రైవర్లకు కనీసం సంక్షేమ బోర్డు లేకపోవడం సిగ్గుచేటన్నారు. డ్రైవర్లను ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. ఉద్యోగ భద్రత లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాలు తీసుకొస్తూ డ్రైవర్లపై పెనుభారాలు వేస్తున్నారని దుయ్యబట్టారు. రానున్న కాలంలో డ్రైవర్ కార్మికులు, సంఘాలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న డ్రైవర్లను యాజమాన్యాలు చిన్నచూపు చూడటం తగదన్నారు. ఇష్టానుసారంగా డ్రైవర్లను తొలగిస్తున్నారని, ఇది చట్ట విరుద్ధమని లక్ష్మయ్య అన్నారు. సమస్యలపై అంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి అల్లూరి అరుణ్, సభ్యులు యర్రంశెట్టి ప్రకాష్, తోట నాని, రత్నరాజు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్.లక్ష్మయ్య

డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - అత్తిలి

యాత్రికుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగను అందించినట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు కె.మణికంఠ, డివైఎఫ్ఐ జిల్లా నేత చింతపల్లి మావో తెలిపారు. స్థానికంగా జరుగుతున్న షష్ఠి ఉత్సవాలకు విచ్చేస్తున్న యాత్రికులకు ఆదివారం డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 500 లీటర్ల మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నేతలు ప్రమోద్ జాషువా, టి.అమృత, వి.వినయ్, ఎన్.లిఖిత, వి.రమేష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న నేతలు

అన్ని హంగులతో తేజ హెయిర్ సెలూన్ ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

భీమవరం తరహాలో రూ.పది లక్షల వ్యయంతో అన్ని హంగులతో హెయిర్ సెలూన్ గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి రావడం శుభ పరిణామమని జువ్వలపాలెం ఉప సర్పంచి కతారి లక్ష్మీపతిరాజు అన్నారు. జువ్వలపాలెంలో సూదికొండ నాగేశ్వరరావు నూతనంగా ఏర్పాటు చేసిన తేజ హెయిర్ సెలూన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. పట్టణాల తరహాలో పల్లెలో హెయిర్ సెలూన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఉప సర్పంచి గోకరాజు వినోద్ రంగరాజు అన్నారు. ఈ సందర్భంగా హెయిర్ సెలూన్ నిర్వాహకుడు సూదికొండ నాగేశ్వరరావు మాట్లాడుతూ జువ్వలపాలెంలో 45 ఏళ్ల క్రితం ఒక బడ్డీకొట్టు నిర్వహించేవాడిని, ప్రస్తుతం ఆధునిక హంగులతో హెయిర్ సెలూన్ గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామని చెప్పారు. బాడీ మసాజ్ మిషన్, హెడ్ మసాజ్, కాళ్ల వాష్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ముదుండి సురేష్‌రాజు, కాళ్లకూరు మాజీ సర్పంచి అడ్డాల శివరామరాజు, టిడిపి నాయకులు గోకరాజు నాగరాజు, షాప్ నిర్వాహకులు సూదికొండ సత్తిబాబు, లంక కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

శశి ఇంజినీరింగ్ విద్యార్థులకు పతకాల పంట

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జెఎన్‌టియు, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కాకినాడ సూరంపాలెంలో యూనివర్శిటీ స్థాయి సెంట్రల్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో భాగంగా నిర్వహించిన పరుగు పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు పది పతకాలు సాధించారని శశి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ ఇస్మాయిల్ ఆదివారం చెప్పారు. పది వేల మీటర్ల పరుగు విభాగంలో బిటెక్ మూడో సంవత్సర విద్యార్థి జి.శివశంకర్‌వరప్రసాద్ మొదటిస్థానంలో నిలిచి స్వర్ణ పతకం, వై.మౌనిక కాంస్య పతకం, 4 ఇంటూ 100 మీటర్ల రిలే పరుగు మహిళల విభాగంలో కె.గీతామాధురి, ఎ.స్రవంతి, టి.నాగస్వాతి, జి.విజయలక్ష్మి రెండో స్థానంలో నిలిచి రజత పతకం, 4 ఇంటూ 400 మీటర్ల పురుషుల విభాగం రిలే పరుగులో బిటెక్ మూడో సంవత్సరం చదువుతున్న బి.తరుణ్‌సాయి, ఎస్.సాయిరాం, జి.శివశంకర్‌వరప్రసాద్, మొదటి సంవత్సర విద్యార్థి వై.నారాయణరావు కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు.

యూనివర్శిటీ క్రీడా పోటీల్లో వరుసగా రెండోసారి స్వర్ణ పతకం, ఒకే పోటీలో పది పతకాలు సాధించి రికార్డు సృష్టించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర అభినందించారు. తమ కళాశాలలో విద్యతోపాటు అన్ని విభాగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించేలా చేయడం తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె.భానుప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ పిఎస్.శేఖర్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ టి.సుబ్రహ్మణ్యం, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

త్యాగధనులన్నారు.. ముంచేశారు..!

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై పోలవరం నిర్వాసితులు తీవ్ర అసంతృప్తి
- ప్రాజెక్టు పనులపైనే శ్రద్ధ.. పునరావాసం, పరిహారం పంపిణీపై అశ్రద్ధ
- పాలకులు స్పందించకపోతే పోరాటాలు ఉధృతం
- ప్రాజెక్టు నిర్వాసితులు స్పష్టీకరణ

ప్రజాశక్తి - పశ్చిమడెస్క్

పోలవరం ప్రాజెక్టు పేరు చెప్పగానే పనులెంత వరకూ వచ్చాయని అంతా అడుగుతుంటారు. అయితే ఆ ప్రాజెక్టు వల్ల నిర్వాసితులకు సంబంధించిన పునరావాస కాలనీలు, పరిహారం, ప్యాకేజీ ఎంత వరకూ అందించారనేది ఏ ఒక్కరూ పట్టించుకోరు. ఫలితంగా అటు ప్రకృతి, ఇటు ప్రభుత్వ విధానాలతో పోలవరం నిర్వాసితులు తమ భవిష్యత్తు ఏమిటో అర్థం కాక బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మించాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది. పలుమార్లు శంకుస్థాపనలు కూడా జరిగాయి. ఎట్టకేలకు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో భూసేకరణ చేపట్టారు. కాల్వలు తవ్వారు. తర్వాత చంద్రబాబు హయాంలో ఈ పనులు చురుగ్గా సాగాయి. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ పనులు నేరుగా చేపట్టాల్సి ఉంది. అయితే తామే పనులు నిర్వహిస్తామని నాడు సిఎంగా ఉన్న చంద్రబాబు బాధ్యత తీసుకున్నారు. పనులిచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంగాని, బాధ్యత తీసుకున్న రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వంగాని నిర్వాసితుల విషయంపై స్పష్టత లేకుండా ముందుకు సాగాయి. కనీసం భూసేకరణ చట్టంతోపాటు గిరిజన చట్టాలను తుంగలోకి తొక్కి పోలవరం మండలంలోని కొన్ని గ్రామాలను బలవంతంగా ఖాళీ చేయించారు. సర్వం కోల్పోయి నిర్వాసితులవుతున్న గిరిజనులకు రూపాయి పరిహారం, ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రభుత్వాలు ముందుకు రాలేదు. అయితే గిరిజనుల తరలింపునకు ఖర్చు చేశామంటూ పెద్దఎత్తున సొమ్మును అధికార యంత్రాంగం స్వాహా చేసిందనే విషయం వెలుగులోకి వచ్చింది. అయినా నాడు ప్రభుత్వం స్పందించిన దాఖలాల్లేవు. పనుల పురోగతి పరిశీలనకు చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు సందర్శించినప్పుడల్లా నిర్వాసితులు త్యాగధనులు అనడం తప్ప పరిహారం, ప్యాకేజీ, పునరావాసంపై కేంద్రంను నిలదీసిన పరిస్థితిగాని, అవి క్షేత్రస్థాయిలో ఏమేర అమలవుతున్నాయో పరిశీలించిన దాఖలాలుగాని లేవు. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీరూ అలానే ఉంది. కనీసం నాడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలు సైతం నీటి మూటలయ్యాయి. రాజశేఖర్‌రెడ్డి హయాంలో సేకరించిన భూములకు రూ.ఐదు లక్షల పరిహారం, పునరావాసం, ప్యాకేజీ, పరిహారం అన్నీ సకాలంలో పూర్తి చేస్తామని నాడు జగన్ పదేపదే చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చాక కానరాని పరిస్థితి ఉంది. కాపర్ డ్యామ్ నిర్మాణంతో విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుల్లో గోదావరికి వరద వచ్చినప్పుడు పరిస్థితి భయానకంగా ఉంటోంది. సమీపంలో ఉన్న కొండలు, గుట్టలపైకెక్కి తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్యాకేజీ చెల్లింపునకు మండలం మొత్తం యూనిట్‌గా తీసుకోవాలని ఎపి గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, నిర్వాసితుల సంఘం, సిపిఎం చాలాకాలంగా కోరుతూనే ఉన్నాయి. కాంటూర్ లెక్కలు సక్రమంగా లేవని చెప్పినా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇటీవల వచ్చిన గోదావరి వరదలు ప్రభుత్వ లోపాలను బట్టబయలు చేశాయి. నిర్వాసితుల కోసం కివ్వాకలో నిర్మించిన పునరావాస కాలనీ జలమయం కావడం అందరినీ ఆలోచింపజేసింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాకుండానే వచ్చిన వరదలకు నిర్వాసిత కాలనీయే నీట మునిగిందంటే ప్రభుత్వ తీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో కుక్కునూరు మండలం మొత్తం ముంపులో ఉంది. అయితే ప్రభుత్వం 41.15 కాంటూర్ ప్రకారం మొదటి విడతలో ఎనిమిది గ్రామాలు ముంపులో ఉన్నాయని, వాటికి ముందుగా పరిహారం చెల్లించి కాలనీలకు తరలిస్తామని చెబుతోంది. 45.75 కాంటూర్ ప్రకారం మిగిలిన గ్రామాలను రెండో దశలో తరలిస్తామని ప్రకటించింది. ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ప్రతీ నిర్వాసిత కుటుంబానికి రూ.పది లక్షల ప్యాకేజీ, 18 సంవత్సరాలు నిండిన వారికి పరిహారం, గతంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎకరాకు రూ.లక్షా పదిహేను వేలు పరిహారం ఇచ్చిన భూముల రైతులకు అదనంగా రూ.ఐదు లక్షలు ఇస్తానన్న జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వాటి మాటే మరిచారని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మండలం మొత్తం యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు పరిహారం ఇచ్చే తేదీనే కటాఫ్ తేదీగా నిర్ణయించి పరిహారం చెల్లించాలని కోరుతూ మండల కేంద్రాల్లో నిరాహారదీక్షలు, వేలేరు గ్రామం నుండి కోయిదా వరకూ పాదయాత్ర, దామరచర్ల నుండి గొమ్ముగూడెం వరకూ సైకిల్ యాత్ర వంటి రూపాల్లో నిర్వాసితులు ఆందోళనలు నిర్వహించారు. ప్రధాన రహదారులపై, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు, మండల బంద్, ఐటిడిఎ ముట్టడి, కలెక్టరేట్ ముందు ధర్నా వంటి కార్యక్రమాలు చేపట్టినా అధికారుల హామీలు తప్ప నేటికీ పరిహారం అందలేదు. పునరావాస కాలనీల నిర్మాణం పూర్తి కాలేదు.

కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిర్వాసితులను ఆదుకోవాలి

వై.నాగేంద్రరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

నిర్వాసితులను నట్టేట ముంచే విధానాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీడాలి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి పరిహారం, పునరావాసానికి నిధులు తీసుకురావాలి. అవసరమైతే రాష్ట్రంలోని అన్ని రాజకీయ, ప్రజాసంఘాలను కలుపుకుని అఖిలపక్షం ఆధ్వర్యాన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో నిర్వాసితుల సమస్యల పరిష్కారంతోపాటు పునరావాసం, పరిహారం, ప్యాకేజీ వంటి వాటికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడాలి. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే రానున్న రోజుల్లో పోరాటాలు మరింత ఉధృతం చేస్తాం.

పోరాటాలతోనే హక్కుల సాధన

మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక హక్కుల కోసం పోరాటాలు చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సుధ పిలుపునిచ్చారు. మానవ హక్కుల వేదిక ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఐదో మహాసభ ఆదివారం తాడేపల్లిగూడెం కపర్తి భవనంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తానేటి ఆనందరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశంలో రాజ్యాంగ హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. ఎనిమిదేళ్ల కాలంలో ఎస్సి, ఎస్టి, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాల జీవన స్థితిగతులు అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. మనువాదాన్ని, మతోన్మాదాన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఎస్సి కాంపోనెంట్ నిధుల చట్ట బద్ధతకు సంబంధించిన పదేళ్ల కాలపరిమితి మరో నెలలో ముగియనుందని, దీనిపై పాలక పక్షాలు ఇప్పటివరకు ఏమీ మాట్లాడటం లేదని ఆమె అన్నారు. ఇడబ్ల్యుఎస్ కేటగిరికి చెందిన యువతకు పదిశాతం రిజర్వేషన్ కల్పించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం విచారకరమన్నారు. బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా సమకూర్చిన రిజర్వేషన్ల స్ఫూర్తికి నీరు కార్చడమే అవుతుందన్నారు. ఎపిడియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సి, ఎస్టి నిర్మాణ వెల్ఫేర్ తదితర కార్పొరేషన్లు, బోర్డులు పనిచేయడం లేదని, వాటి ద్వారా ఎలాంటి లబ్ధి అందడం లేదని చెప్పారు. ఐడిల్ పనిచేసే పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.ఆరు వేలు మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. అవి కూడా సక్రమంగా అందటంలేదన్నారు. ఎస్సి, ఎస్టి, మైనార్టీ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలకు మద్దతుగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సభాధ్యక్షులు తానేటి ఆనందరావు మాట్లాడుతూ మానవ హక్కుల వేదిక కార్యకలాపాలను జిల్లా వ్యాప్తంగా విస్తరించడానికి కృషి చేయాలని కోరారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు దారుణంగా ఉన్నాయని, వాటిపై అధ్యయనం చేసి ఒక స్థితి నివేదిక రూపొందిస్తామని తెలిపారు. మానవహక్కుల వేదిక కృష్ణా జిల్లా కార్యదర్శి గుట్ట రోహిత్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు ఎలికే రాజేంద్రప్రసాద్, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య అధ్యక్షులు ఎస్.కె.మస్తాన్, వివిధ ప్రజాసంఘాల నాయకులు కొడమంచిలి రమణ, మెంటే వెంకన్న, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, మల్లిపూడి షర్మిల, నాగేశ్వరరావు, తాడికొండ శ్రీనివాసరావు, మెరిపో జాన్‌రాజు, తెన్నేటి సంజయ్‌ఖాన్, నేర్పరి రామకృష్ణ, ఆచంట ప్రసాద్ మాట్లాడారు. అనంతరం మానవహక్కుల వేదిక ఉమ్మడి పశ్చిమ జిల్లా అధ్యక్షునిగా ఎలికె రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులుగా మల్లిపూడి షర్మిల, ప్రధాన కార్యదర్శిగా తానేటి ఆనందరావు, కార్యదర్శిగా మెడియం ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ మహాసభలో జిల్లా నలుమూలల కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్మరణ సభలో మాట్లాడుతున్న దిగుపాటి రాజగోపాల్

సింహాచలం ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

కొత్తపల్లి సింహాచలం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఎం మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. కొత్తపల్లి సింహాచలం సంస్మరణ సభ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షతన ఆదివారం ఆచంటలో నిర్వహించారు. సింహాచలం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మాజీ ఎంఎల్ఎ రాజగోపాల్ మాట్లాడుతూ సింహాచలం 1997 నుంచి సిపిఎంలో అంకితభావంతో తుది శ్వాస విడిచేవరకు కొనసాగారన్నారు. ఆయన వ్యవసాయ కార్మిక సంఘంలో పని చేస్తున్నప్పుడు వ్యవసాయ కూలీల పోరాటంలో ఆయనపై ఎన్నో కేసులు పెట్టినా, నిర్భయంగా వాటిని లెక్క చేయకుండా కూలీలతో పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ సింహాచలం పార్టీ పట్ల అంకితభావంతో పనిచేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వద్దిపర్తి అంజిబాబు, సిర్రా నరసింహమూర్తి, ఐయినపర్తి సూర్యనారాయణరాజు, వద్దిపర్తి శ్రీనివాసరావు, బొర్రా ధర్మారావు, వాసా రామ్మోహన్‌రావు, కొండేటి సత్యనారాయణ, తోటపల్లి సత్యనారాయణ, కె.మసేన్, బద్ద ప్రసాద్ పాల్గొన్నారు.


విశ్వనాథరాజును పరామర్శిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

విశ్వనాథరాజుకు ఎంఎల్ఏ శ్రీరంగనాథరాజు పరామర్శ

ప్రజాశక్తి - పెనుమంట్ర

సూర్యకుమారి (ఫైల్)

ఆలమూరుకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు పెనుమత్స విశ్వనాథరాజు భార్య సూర్యకుమారి (72) శనివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఆదివారం ఆలమూరు తీసుకొచ్చారు. విశ్వనాథరాజును ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజు పరామర్శించి సానుభూతి తెలిపారు. విశ్వనాథరాజుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విశ్వనాథరాజు కుటుంబసభ్యులను బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుబ్బల తమ్మయ్య, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి), వైసిపి నాయకులు భూపతిరాజు వెంకట శ్రీనివాస్‌రాజు, కర్రి వేణుబాబు, రాజరాజు వెంకట సాయి రామ రాజు, కుచ్చర్లపాటి వెంకటపతి, బుర్రా రవికుమార్, కుచ్చర్లపాటి సూర్యనారాయణ రాజు, అత్తిలి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కూనపరెడ్డి జయరాజు పరామర్శించారు.

తోకతిప్పలో రోడ్డు సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తోకతిప్ప గ్రామంలో రోడ్డు సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని తోకతిప్ప గ్రామంలో ఆదివారం సిపిఎం మండల కార్యదర్శి బొడ్డు లక్ష్మీపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ తోకతిప్ప గ్రామంలో రోడ్డు సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. సొంత స్థలాల్లో గృహాలు కట్టుకున్నవారికి బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణం బిల్లులు త్వరగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ సభ్యులు నాగేశ్వరరావు, నాగార్జున, నాని పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పోడూరు

వైసిపి పాలనలో అన్ని తరగతుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని రావిపాడు గ్రామంలో 'ఇదేమి ఖర్మ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, ఎంపిటిసి విప్పర్తి చిట్టిబాబు, రావి స్వర్ణసింగ్, కొల్లు రామారావు, యేల్లమెల్లి వెంకట్రావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ తాతాజీ

'చంద్రబాబుకు ఇవే ఆఖరి ఎన్నికలు'

ప్రజాశక్తి - పాలకొల్లు

జగన్ ప్రవేశ పెట్టిన పథకాలకు చంద్రబాబు ఉక్కిరిబిక్కిరి అయి తన పరిస్థితినే ఇదేం ఖర్మ రాష్ట్రానికి అని జగన్‌పై ఎదురుదాడి చేస్తున్నారని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు చంద్రబాబును అన్ని ఎన్నికల్లో తిరస్కరించినా ఇంకా పగటి కలలు కంటున్నారన్నారు. ఎన్‌టిఆర్‌కు చంద్రబాబు ద్రోహం చేసినప్పుడే ప్రజలు ఇదేం ఖర్మ అనుకున్నారన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ఆలస్యం కావడానికి చంద్రబాబు వైఖరి కారణమన్నారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు చెన్నువిజయ్, గంటా నరేష్, కొరగింజల పాలపర్తి, పెచ్చెట్టి కృష్ణాజీ పాల్గొన్నారు.

జనసేనలో ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జనసేనలో చేరే ప్రతి కార్యకర్తకూ పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని జనసేన పార్టీ నరసాపురం నియోజకవర్గ కన్వీనర్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామానికి చెందిన 50 మంది వైసిపి నాయకులు గుబ్బల మహారాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. ఈ మేరకు జనసేన కార్యాలయంలో బొమ్మిడి నాయకర్ వారికి జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బందెల రవీంద్ర, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, ఇంజేటి దానం, బొక్క చంటి, సంజీవరావు, తోట నాని, బళ్ల హనుమంతు, కడలి పద్మారావు, చామకూరి సుబ్రహ్మణ్యం, మట్ల సూర్య, కటకం శెట్టి సాయి, కటకంశెట్టి రామకృష్ణ, కటకం శెట్టి సుభాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఓటు హక్కు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం


భీమవరంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం పురపాలక సంఘం పరిధిలో గునుపూడి, లూథరన్ హైస్కూళ్లలో నిర్వహిస్తున్న పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్ల నమోదు, సవరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమ నిబంధనలు అనుసరించి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా, విమర్శలకు తావులేకుండా ఓటర్లందరూ నమోదయ్యేలా కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఓటర్లు అందుబాటులో లేకపోతే వారికి తగిన సమాచారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసిరాజు, తహశీల్దార్ వై.రవికుమార్, బిఎల్ఒలు పాల్గొన్నారు.

ఉండి : ఓటరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను హెచ్చరించారు. మండలంలోని చెరుకువాడ, వాండ్రం 113, 114 పోలింగ్ స్టేషన్‌లను జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బిఎల్ఒలకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. పొరపాట్లు జరగకుండా ఓటర్లఅందరూ నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఓటర్లు అందుబాటులో లేకపోతే వారికి తగిన సమాచారాన్ని అందించాలని బిఎల్ఒలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉండి ఇఆర్ఒ జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.రవి కుమార్, ఉండి తహశీల్దారు ఎం.రవీంద్ర కుమార్, ఎలక్షన్ డిటి స్వామినాయుడు, ఆర్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

పెనుగొండ : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ గురుమూర్తిరెడ్డి అన్నారు. మండలంలోని సిద్ధాంత గ్రామంలో ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం తహశీల్దార్ గురుమూర్తిరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ ఈశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల శతజయంత్యుత్సవం


ఆకివీడులో...

ప్రజాశక్తి - ఆకివీడు

తన గానంతో ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని, ఆయన తెలుగువాడిగా పుట్టడం ఇక్కడ ప్రజల అదృష్టమని పలువురు వక్తలు అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక దొరగారు చెరువుగట్టున ఉన్న ఘంటసాల విగ్రహానికి ఆదివారం ఉదయం స్థానిక లలిత కళా సంస్థ సరిగమ సంగీత పరిషత్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పరిషత్ అధ్యక్షులు ఎస్.కోటేశ్వరరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం ప్రజానాట్యమండలి గాయకుడు షేక్‌వలి, మహమ్మద్ మదిని, యోగాసనాచార్య కందుల సత్యనారాయణ, ఘంటసాల పాటల గాయకులు ఎస్.కనకారావు, నెల్లి బాలాదిత్యలను సత్కరించారు. అనంతరం ఘంటసాలకు నివాళిగా గాయకులు ఘంటసాల గీతాలను ఆలపించారు. ప్రధానవక్తగా ప్రముఖ వైద్యులు పిబి.ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు పెంకి అప్పారావు, పరిషత్ సభ్యులు కొల్లు వెంకన్నబాబు, కౌన్సిలర్ గేదెల అప్పారావు, కార్యక్రమం ప్రోత్సాహకులు, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా సత్యనారాయణ, సినీ ఎగ్జిబిటర్ ముదునూరి శ్రీహరిరాజు, అడ్వకేట్ నెల్లి సతీష్ కుమార్, యోగా సంస్థ కార్యదర్శి కుంకట్ల సత్యనారాయణ, రమణమూర్తి, రైస్ మిల్లర్ గొంట్ల సత్యనారాయణ, సీనియర్ లయన్స వేజళ్ల దిలీప్, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

తణుకు : గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుక రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ వావిలాల సరళాదేవి, వెంకట రమేష్ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ పార్కు వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సరళాదేవి మాట్లాడుతూ నేటి గాయకులు ఘంటసాల జీవిత చరిత్రను తెలుసుకుని కష్టపడి పైకి రావాలన్నారు. ఆయన పాటలు చెరగని ముద్ర వేసుకున్నాయని, క్విట్ ఇండియా వంటి సమయంలో జైలుకు వెళ్లి దేశభక్తిని కూడా చాటుకున్నారని అన్నారు. ఘంటసాల జన్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల ఆరో తేదీన స్థానిక రామకృష్ణ సేవాసమితిలో గౌతమి బృందంతో విద్యార్థులతో ఘంటసాల పాటల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.సుభాషిని, కడియాల సూర్యనారాయణ, ఎం.నాగమణి పాల్గొన్నారు.

పాలకొల్లు : సంగీతానికి ఉన్న ప్రాముఖ్యత వెలకట్టలేనిదని, సంగీతం అమర రామమని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. ఘంటశాల శత జయంతి సందర్భంగా పాలకొల్లు ఎన్‌టిఆర్ కళాక్షేత్రం వద్ద ఘంటశాల సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రోజారమణి, యలమంచిలి ఎంపిడిఒ త్రిశూలపాణి, కొల్లి నరసింహమూర్తి, చేగొండి సత్యనారాయణమూర్తి, నిర్వాహకులు నరసింహమూర్తి పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం ఏర్పాటు చేశారు. ప్రసాద్ వితరణ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

పర్యాటకులతో, ప్రకృతి ప్రేమికులతో మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు.

నాట్యం చేస్తున్న కళాకారులు

అలరించిన కూచిపూడి, భరత నాట్యాలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని ఆగర్రులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విప్లవవీరుడు, తెలుగుజాతి ముద్దుబిడ్డ శ్రీఅల్లూరి సీతారామరాజు 125వ జయంతోత్సవాలు మండలంలోని ఆగర్రులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి భరతనాట్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాలకొల్లు మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్, పి.బాబు, జిఎస్ఎన్.రాజు, ఆగర్రు టిడిపి నాయకులు గాది రాజు, అర్జున్ రాజు, అల్లూరి సత్యనారాయణరాజు, పేనుమత్స కృష్ణంరాజు, గాదిరాజు సత్యనారాయణ, కొత్తపల్లి కృష్ణంరాజు, గాదిరాజు భాస్కర్‌రాజు, పార్టీ గ్రామ ప్రెసిడెంట్ కలిదిండి శ్రీనివాసరాజు, రాచమళ్ల మీరయ్య, పంచగల్లా సైమన్, డి.బెంజమానురాజు పాల్గొన్నారు.

స్వాములకు భిక్ష అందిస్తున్న యతిరాజరామ్మోహన్ నాయుడు, శిరిష దంపతులు

ఆకట్టుకున్న గానామృతం

నరసాపురం టౌన్ : ప్రతిఒక్కరూ భక్తి భావంతో ఉండాలని కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు కొవ్వలి యతిరాజరామ్మోహన్ నాయుడు అన్నారు. నరసాపురం పట్టణం ఏడో వార్డులో కొవ్వలి యతిరాజరామ్మోహన్‌నాయుడు వెంకట శిరీష దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం గణపతి హోమం, తాంత్రిక పూజ, అయ్యప్ప పడిపూజ, బిక్ష తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను మంచిలి దుర్గాప్రసాద్‌శర్మ, పెద్దింటి విజయసారధి, కోటిపల్లి బ్రహ్మానంద స్వామి పర్యవేక్షించారు. రాజోలుకు చెందిన సలాది శివస్వామి, విజయవాడకు చెందిన సుబ్బు స్వాములతో ఏర్పాటు చేసిన అయ్యప్ప గానామృతం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బిక్ష కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజా కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున స్వాములు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకిరామ్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కొల్లు పెద్దిరాజు, సంకు భాస్కర్‌నాయుడు, మల్లాడి మూర్తి, నంద్యాల బాబు పాల్గొన్నారు.

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

కోమటితిప్పలో వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కోమటితిప్పలో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న వాలీబాల్ పోటీలు ఆదివారం కూడా కొనసాగాయి. కోమటతిప్పపై దెయ్యాలతిప్ప, వేములదేవిపై బుట్టాయగూడెం, కోమటితిప్ప-ఎపై కోమటితిప్ప-డి, దెయ్యాలతిప్పపై ఎల్‌బి చర్ల విజయం సాధించాయని నిర్వాహకులు తెలిపారు.

KANAKADURGA FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : సుబ్బమ్మదేవి హైస్కూల్ రోడ్డు, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
బ్రాంచిఆఫీస్ : ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
1st ఫ్లోర్, బస్‌స్టాప్ ఎదురు, దేవరపల్లి.
1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పలవెంకన్న సెంటర్,వేల్పూరురోడ్డు, తణుకు
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 27.12.2022 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2620.07 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

మహారాజశ్రీ 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో : తణుకు
O.S.No. 442/2020
Between:
Vijaya Bank, Now Bank of Baroda ...*Plaintiff*
AND
Jholeti Peda Narasimha Rao
Jholeti Mangatayaru
Vemula Aswani Kumar ...*Defendants*

ప్రకటన

పై నెంబరు గ్రంధములో మీ ముగ్గురికి ఎన్నిసార్లు సమన్లు పంపించినప్పటికినిన్ని అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు చేసియున్నారు. పైనెంబరు గ్రంధము **ది.15-12-2022వ తేదీన వాయిదా అయి ఉన్నది.** కావున సదరు తేదీన మీరు ఇరువుతూ ప్రత్యక్షంగా కాని, పరోక్షమంగా కాని అనగా మీ ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం 10:00 గంటలకి హాజరు కావల్సినదిగా ఈ ప్రకటన ద్వారా తెలుపడమైనది. లేని ఎడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తణుకు, ఓ.ఎన్.కృష్ణ
03-12-22. అడ్వకేట్, తణుకు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE:TANUKU
O.S.No. 204/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank) Alamuru ...*Plaintiff*
VS
Metla Saraswathi an Others ...*Defendants*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
డి-1: మెట్ల సరస్వతి, భర్త: కృష్ణమూర్తి, హిందువు, స్త్రీ, 42 సం॥లు, వ్యవసాయం, డో.నం. 3-17, గగ్గిపర్రు గ్రామం, యలమంచలి మండలం, నర్సాపురం జె.సి.జె.సి.
డి-2: వేముల శ్రీనివాస్, తండ్రి: భాస్కరరావు, హిందువు, పురుషుడు, 49 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 22-5-8, సాయినగర్ కాలనీ, పాలకొల్లు,పాలకొల్లు జె.సి.జె.సి.

పై నెంబరు దావా గ్రంధములో మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 06-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొన వలసిందిగాను** అట్లు కాని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

టి.రమాదేవి
అడ్వకేట్, తణుకు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE:TANUKU
O.S.No. 349/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank) Alamuru ...*Plaintiff*
VS
Arepalli Sujatha and Others ...*Defendants*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
డి-1: ఆరేపల్లి సుజాత, భర్త: రంగారావు, హిందువు, స్త్రీ, వ్యవసాయం, గగ్గిపర్రు గ్రామం, యలమంచలి మండలం, నర్సాపురం జె.సి.జె.సి.
డి-2: వేముల రాజేశ్వరరావు, తండ్రి: వెంకట రత్నం, హిందువు, పురషుడు, వ్యవసాయం, గగ్గిపర్రు గ్రామం, యలమంచలి మండలం, నర్సాపురం జె.సి.జె.సి.

పై నెంబరు దావా గ్రంధములో మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 06-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొన వలసిందిగాను** అట్లు కాని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

డి.ఎస్.వి.కృష్ణాజీ
అడ్వకేట్, ఏలూరు.

మహారాజశ్రీ 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో : తణుకు
O.S.No. 376/2020
Between:
Vijaya Bank, Now Bank of Baroda ...*Plaintiff*
AND
Meesala Satyanarayana
Meesala Nageswara Rao ...*Defendants*

ప్రకటన

పై నెంబరు గ్రంధములో మీ ఇరువురికి ఎన్నిసార్లు సమన్లు పంపించినప్పటికినిన్ని అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు చేసియున్నారు. పైనెంబరు గ్రంధము **ది.15-12-2022వ తేదీన వాయిదా అయి ఉన్నది.** కావున సదరు తేదీన మీరు ఇరువుతూ ప్రత్యక్షంగా కాని, పరోక్షమంగా కాని అనగా మీ ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం 10:00 గంటలకి హాజరు కావల్సినదిగా ఈ ప్రకటన ద్వారా తెలుపడమైనది. లేని ఎడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తణుకు, ఓ.ఎన్.కృష్ణ
03-12-22. అడ్వకేట్, తణుకు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE:TANUKU
O.S.No. 298/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank) Alamuru ...*Plaintiff*
VS
Midde Sita an Others ...*Defendants*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
డి-1: మిద్దే సీత, భర్త: రంగారావు, హిందువు, స్త్రీ, 50 సం॥లు, వ్యవసాయం, డో.నం. 15-2-3ఎ, శంభునిపేట, పాలకొల్లు, పాలకొల్లు జె.సి.జె.సి.
డి-2: తొంట జ్యోతి లక్ష్మి, భర్త: శ్రీనివాసరావు, హిందువు, స్త్రీ, 43 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 25-8-12, శంభునిపేట, పాలకొల్లు పాలకొల్లు జె.సి.జె.సి.

పై నెంబరు దావా గ్రంధములో మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 06-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొన వలసిందిగాను** అట్లు కాని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

ఎన్.రవి శంకర్

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE:TANUKU
O.S.No. 170/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank) Alamuru ...*Plaintiff*
VS
Arepalli Seetharatnam an Others ...*Defendants*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
డి-1: ఆరేపల్లి సీతారత్నం, భర్త: శంకర, హిందువు, స్త్రీ, వ్యవసాయం, డో.నం. 9-82, 40 సం॥లు, గగ్గిపర్రు గ్రామం, యలమంచలి మండలం, నర్సాపురం జె.సి.జె.సి.
డి-2: వేముల యర్రియ్య, తండ్రి: సూరన్న, హిందువు, పురుషుడు, 50 సం॥లు, వ్యవసాయం, గగ్గిపర్రు గ్రామం, యలమంచలి మండలం, నర్సాపురం జె.సి.జె.సి.

పై నెంబరు దావా గ్రంధములో మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.06-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొన వలసిందిగాను** అట్లు కాని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

టి.రమాదేవి
అడ్వకేట్, తణుకు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE:TANUKU
O.S.No. 598/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank) Alamuru ...*Plaintiff*
VS
Vemula Raja Rajeswari and Others ...*Defendants*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
డి-1: వేముల రాజరాజేశ్వరి, తండ్రి: అశ్వని కుమార్, హిందువు, స్త్రీ, డాక్టర్, డో.నం. 22-5-8, 24 సం॥లు, సాయినగర్ కాలనీ, పాలకొల్లు, పాలకొల్లు జె.సి.జె.సి.
డి-2: వేముల అశ్వని కుమార్, తండ్రి: భాస్కరరావు, హిందువు, పురుషుడు, 52 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 22-5-8, సాయినగర్ కాలనీ, పాలకొల్లు, పాలకొల్లు జె.సి.జె.సి.
డి-3: వేముల శారద, భర్త: అశ్వని కుమార్, హిందువు, స్త్రీ, 46 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 22-5-8, సాయినగర్ కాలనీ, పాలకొల్లు, పాలకొల్లు జె.సి.జె.సి.

పై నెంబరు దావా గ్రంధములో మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.08-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొన వలసిందిగాను** అట్లు కాని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

టి.రమాదేవి
అడ్వకేట్, తణుకు.